క్లుప్తంగా

సామాజిక సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలి



కేఎస్.ఆనంద్‌రావుకు పురస్కారాన్ని అందజేస్తున్న వేణుగోపాలచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: ప్రతిఒక్కరూ సామాజిక సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.వేణుగోపాల చారి అన్నారు. శనివారం రవీంద్ర భారతిలో అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ 3వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక సేవ చేస్తున్న పలువురికి జాతీయ సేవారత్న అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కోట సుశీల సత్యనారాయణ సేవా ట్రస్ట్ చైర్మన్ కేఎస్.ఆనంద్‌రావు, సంస్థ వ్యవస్థాపకురాలు సరోజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

గౌలిపురా: ఆర్యవైశ్య సంఘం లాల్‌దర్వాజా గౌలిపురా ఆధ్వర్యంలో అమావాస్యను పురస్కరించుకొని గౌలిపురా బతుకమ్మ బావి వద్ద నున్న లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పరమశివునికి విశేష పూజలు, రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఛత్రినాక పాత పోలీస్‌స్టేషన్ వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శ్రీరాం కోటయ్య గుప్తా, సలహాదారులు చీల రాములుగుప్తా, సరాబు విశ్వేరయ్య గుప్తా, అధ్యక్షులు శ్రీధర మల్లికార్జున్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి సరాబు సంతోష్ గుప్తా, కోశాధికారి కొల్కూరి నర్సింహులుగుప్తా, ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఇరుకుల్ల భిక్షపతి గుప్తా, సభ్యులు పాల్గొన్నారు.

వార్షికోత్సవం



ఐఫూ మెషిన్‌ను ప్రారంభిస్తున్న వర్ధమాన నటి రాశీసింగ్

గోల్కొండ: తమన్నా స్కిన్ అండ్ హెయిర్ కేర్ 2వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. అత్తాపూర్ రింగురోడ్డులో ఉన్న తమన్నా స్కిన్ అండ్ హెయిర్ కేర్‌లో వర్ధమాన నటి రాశీసింగ్, పలువురు మోడల్స్ ఈ సందర్భంగా సందడి చేశారు. రాశీసింగ్ ఈ సందర్భంగా ఐఫూ మెషిన్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తమన్నా రూజ్ రాడ్‌నికా తల్వార్, డాక్టర్ కార్తమినీ బాబా, డాక్టర్ ప్రత్యూష తదితరులు ఉన్నారు.

అన్నదానం



సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని పద్మావతి గోదా సమేత వుంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు నల్లదీగల శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యుగేందర్‌రెడ్డి, ఆలయ ఈఓ జయంతి, భక్తులు పాల్గొన్నారు.

స్నేహితుల మధ్య ఘర్షణ.. ఇద్దరికి గాయాలు

విజయనగర్‌కాలనీ: స్నేహితుల మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుని కర్రలతో కొట్టుకోవడంతో ఇరువురికి గాయాలైన ఘటన శనివారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మహ్మద్ అహెమ్(17), మహ్మద్ అమన్(16) అన్నదమ్ములు. మెహిదీపట్నం కింగ్స్ రెస్టారెంట్ హోటల్ వద్ద ఘర్షణ పడ్డారు. అక్కడి నుంచి వెళ్లిన అనంతరం మురాద్‌నగర్ సయ్యద్ అలీగూడ మరో స్నేహితుడు మహ్మద్ అక్మల్ (17) ఇంటికి వచ్చి రాజీ కుదుర్చుకుందామని ఫోన్‌చేసి పిలిపించారు. హామెద్ అతని స్నేహితుడు ఇమ్రోజ్(17)తో వచ్చి మాట్లాడుతుండగా తిరిగి ఘర్షణపడి అక్కడ నిర్మాణంలో ఉన్న భవనంలో నుంచి కర్రలు తెచ్చుకుని పరస్పరం దాడి చేసుకున్నారు. ఘర్షణలో ఇమ్రోజ్‌కు, హామెద్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను వైద్య చికిత్సల నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అజాతశత్రువు దేవర కరుణాకర్



కరుణాకర్‌కు నివాళులర్పిస్తున్న వివిధ పార్టీల నాయకులు



సంతాప సభలో మాట్లాడుతున్న బోడి అశోక్‌యాదవ్

గోల్కొండ: సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో దివంగత దేవర కరుణాకర్ అందరితో సత్సంబంధాలు కలిగి ఉండేవాడని బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. గుడిమల్కాపూర్ కార్పొరేటర్ బీజేపీ నాయకుడు దివంగత దేవర కరుణాకర్‌కు కార్వాన్ యాదవ సంఘం ఆధ్వర్యంలో శనివారం సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంచలంచెలుగా రాజకీయ ప్రస్థానంలో ఎదిగారని ఆయన అన్నారు. రెండు సార్లు కార్పొరేటర్‌గా పని చేశారన్నారు. బల్దియా కౌన్సిల్ సమావేశాలలో హైదరాబాద్ నగర సమస్యలపై ప్రభుత్వాన్ని ఎంతో సునిశితంగా విమర్శిస్తూ సున్నితమైన సమస్యలపై గొంతు వినిపించేవారని ఆయన అన్నారు. టీఆర్ఎస్ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి టి. జీవన్ సింగ్ మాట్లాడుతూ.. పదవులను ఆశించకుండా ఆయన ప్రజాసేవలో 3 దశాబ్దాలకు పైగా ఉన్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బోడి అన్ను యాదవ్, మధుసూదన్, వివిధ కుల సంఘాల వారు పాల్గొన్నారు.

కరుణాకర్‌కు ఘన నివాళి

గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దివంగత దేవర కరుణాకర్ చేసిన సేవలను వెలకట్టలేమని కార్వాన్ యాదవ సంఘం అధ్యక్షుడు బోడి అశోక్‌యాదవ్ అన్నారు. శనివారం గుడిమల్కాపూర్‌లో దేవర కరుణాకర్ సంతాప సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల వారిలో కలుపుగోలుగా ఉండే ఏకైక నేత కరుణాకరేనన్నారు. కాలనీలు, బస్తీల అభివృద్ధికి కృషి చేస్తూనే కుల సంఘాలకు అండగా ఉండేవారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక సంఘం నాయకులు కాటం నర్సింహ నాయకులు, బీజేపీ రాష్ట్ర నాయకులు దేవర శ్రీనివాస్, టీఆర్ఎస్ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి టి. జీవన్‌సింగ్, బీజేపీ నాయకులు నామ యాదగిరినేత, మురళీకృష్ణ, శ్రీకాంత్‌సాగర్, అశ్విన్ మోదీ, అన్ను యాదవ్ తదితరులున్నారు.

వ్యాపారులను వేధిస్తే కఠిన చర్యలు



మంత్రి తలసానికి వినతిపత్రం అందజేస్తున్న ఆనంద్‌కుమార్‌గౌడ్

అబిడ్స్: వ్యాపారులను ఎవరైనా వేధిస్తే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. గౌలిగూడ ప్రాంతంలో ట్రావెల్స్, వాహనాలు, చిన్న చిన్న వ్యాపారాలు చేసే వారిని మామూళ్లు ఇవ్వాలని పలువురు వేధిస్తున్నట్లు మంత్రి తలసానికి బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎవరైనా వేధిస్తే వ్యాపారులు నేరుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. పోలీస్ కమిషనర్, డీసీపీలతో మాట్లాడి వ్యాపారులను ఎవరూ వేధించకుండా తగు చర్యలు తీసుకుంటానన్నారు. అనంతరం ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. వ్యాపారులపై కొంతమంది స్థానికులు వేధిస్తుండడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో నరేష్‌గౌడ్, బాలకిషన్, వెంకట్‌స్వామి, రమేష్, అరుణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ కోటలో అధికారుల పర్యటన



గోల్కొండ: సెవన్ టూంబ్స్ చౌరస్తా నుంచి బంజార దర్వాజ మీదుగా గోల్కొండ కోటకు స్కై కేబుల్ వేయడానికి సాధ్యసాధ్యాలను పరిశీలించడానికి అధికారుల బృందం శనివారం గోల్కొండ కోటకు వచ్చింది. ఈ సందర్భంగా వారు గోల్కొండ బంజార దర్వాజ, దానిని ఆనుకుని ఉన్న సఫిల్‌గూడను పరిశీలించారు. గోల్కొండ కోటకు వచ్చే పర్యాటకుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుందని, టోలిచౌకి కార్పొరేటర్ మహ్మద్ హారూన్ ఫరాన్ అధికారులకు తెలిపారు. అంతేకాకుండా ఉదయం నుంచి మధ్యాహ్నం, సాయంత్రం నుంచి రాత్రి 11 వరకు బంజారు దర్వాజ వద్ద ట్రాఫిక్ పెరుగుతుందని అధికారులకు తెలిపారు. అంతేకాకుండా గోల్కొండ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారు సైతం దారిలోనే వస్తారని ఆయన తెలిపారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం బంజార దర్వాజ వద్ద వాహనాల రాకపోకలు బాగా పెరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండీఏ ఈఈ మన్మోహన్ సింగ్, డీఈ రాజ్‌మోహన్, ఏఈ వెంకన్న తదితరులున్నారు.

గోల్కొండ కోటకు స్కై కేబుల్ అవసరం: ఎమ్మెల్యే కౌసర్



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: గోల్కొండ కోటకు స్కై కేబుల్ ఎంతో అవసరమని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన బల్దియా, హెచ్ఎండీఏ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెలవు రోజుల్లో గోల్కొండ కోటకు సుమారు 25 వేల మంది పర్యాటకులు వస్తున్నారని, దీనివల్ల ఎక్కువగా బంజార దర్వాజ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. గోల్కొండకు వచే వారిలో పర్యాటకులే కాకుండా వివిధ పనుల నిమిత్తం కోటకు వచ్చే వారు బంజార దర్వాజ గుండానే వస్తారని ఆయన అన్నారు. సెవన్ టూంబ్స్ చౌరస్తా నుంచి బంజార దర్వాజ మీదుగా స్కై కేబుల్ వేస్తే ట్రాఫిక్ చిక్కులకు పరిష్కారం లభిస్తుందని ఆయన అన్నారు. స్కై కేబుల్ నిర్మాణం విషయంపై హైదరాబాద్ ఎంపీ, మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ రాసిన లేఖను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ సెక్రటరీ అరవింద్‌కుమార్‌కు ఇవ్వడం జరిగిందన్నారు. స్కై కేబుల్ నిర్మాణంపై ఆయన కూడా హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండీఏ ఈఈ మన్మోహన్ సింగ్ తదితరులున్నారు.

'పరీక్ష పే చర్చా'



చార్మినార్: క్రమశిక్షణతో చదివితే ఆశించిన ఫలితాలను సాధించవచ్చునని మాజీ కార్పొరేటర్ పాశం సురేందర్ అన్నారు. శాలిబండలోని గీతా హైస్కూల్‌లో శనివారం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో చేతన్‌కుమార్ సూరి, కుమార్, ప్రభాకర్, దేవిసింగ్, పాశం శైలజ, వెంకటేశ్, కరం జయ, పి.లక్ష్మణ్, సునీల్ తివారీ, రాకేశ్ తెలిపారు.

స్కాలర్‌షిప్ అందజేత

లంగర్‌హౌస్: మేళ్ల చెరువు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలోని ముగ్గురు విద్యార్థినులకు స్కాలర్‌షిప్ శనివారం అందజేశారు. ఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం వాసవి కళాశాలలో ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసి స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. వాసవి కళాశాల మేనేజ్‌మెంట్ కార్యదర్శి క్రిష్ణమూర్తి, సభ్యులు పార్థసారథి, బాలాజీ, రమణ పాల్గొన్నారు.

ఫిష్ మార్కెట్ వ్యాపారులకు న్యాయం చేయండి



మంత్రిని కలిసిన వ్యాపారులు, నందకిశోర్ వ్యాస్

అబిడ్స్: బేగంబజార్ ఫిష్ మార్కెట్‌లోని గంగపుత్ర మచ్చిపురా సమాజ్ వ్యాపారులు రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు నందకిశోర్‌వ్యాస్ ఆధ్వర్యంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిశారు. బేగం బజార్‌లో నిర్మించిన ఆధునాతన ఫిష్ మార్కెట్‌లో మచిలిపురా గంగపుత్ర సమాజ్ వ్యాపారులందరికీ వెంటనే షాపులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు ఫోన్‌చేసి మచ్చిమార్కెట్ మచిలీపురా వ్యాపారులందరికీ న్యాయం చేయాలని ఆదేశించారు. స్వయంగా జోనల్ కమిషనర్ మచ్చిమార్కెట్‌ను సందర్శించి ప్రతిఒక్కరికీ న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేశారు. అనంతరం నందకిశోర్ వ్యాస్ మాట్లాడుతూ.. మచిలిపురా ఫిష్‌మార్కెట్ వ్యాపారులకు న్యాయం జరిగే విధంగా తనవంతు కృషి చేస్తానన్నారు.

అలరించిన ఆర్ట్ ఎగ్జిబిషన్



సంతోష్‌నగర్: కంచన్‌బాగ్‌లోని బ్రహ్మ ప్రకాశ్ డీఏవీ స్కూల్‌లో శనివారం ఆర్ట్ ఎగ్జిబిషన్ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో 700 మంది ఆర్ట్ విద్యార్థులు, 200 మంది క్రాఫ్ట్ విద్యార్థులు వారు స్వయంగా తయారు చేసిన చిత్రాలను పాఠశాల ప్రాంగణంలో ప్రదర్శించారు. ప్రతి చిత్రం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. వీటిని వీక్షించడానికి విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు పాఠశాల చైర్మన్ గౌరీశంకర్‌రావు, డీఏవీ ఏఆర్ఓ వసంత ఎస్ రామన్ హాజరై కుంచెతో విద్యార్థులను ప్రశంసించారు. పాఠశాల ప్రిన్సిపాల్ వీఎస్.ప్రశాంత్‌తో పాటు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఉపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయ, విద్యార్థి బృందం పాల్గొన్నారు.

అచ్చయ్య కుమార్ రావు సేవలు ప్రశంసనీయం



పుస్తక ఆవిష్కరణ దృశ్యం

నాంపల్లి: దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తా మాస పత్రిక, మలేసియా తెలుగు సంఘం సంయుక్తాధ్వర్యంలో మలేసియా తెలుగు సంఘం పూర్వాధ్యక్షుడు డాక్టర్ మద్దాల అచ్చయ్య కుమార్ రావు అరవై వసంతాల జీవన గమనంపై ముద్రితమైన 'అలలెత్తిన కలల ప్రపంచం'అనే పుస్తక సమీక్ష సభ శనివారం సాయంత్రం తెలుగు వర్సిటీ నందమూరి తారక రామారావు కళా మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ.రమణాచారి ముఖ్యఅతిథిగా వర్చువల్ విధానంలో పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. మలేసియాలో ఉంటూ తెలుగు మాట్లాడే ప్రజల ఆకాంక్షల కోసం పాటుపడుతున్న డాక్టర్ మద్దాల అచ్చయ్య కుమార్ సేవలు ప్రశంసనీయమని కేవీ.రమణాచారి అభినందించారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ చెల్లప్ప, తెలుగు వర్సిటీ పూర్వ ఉపాధ్యక్షురాలు ఆవుల మంజులత, ఎం.వి.కె.ఆర్.అంతర్జాతీయ తెలుగు కేంద్రం అనుబంధ అధ్యాపకులు ప్రొఫెసర్ మునిరత్నం నాయుడు, ఎం.వి.కె.ఆర్. అంతర్జాతీయ తెలుగు కేంద్రం సంచాలకులు ప్రొఫెసర్ రెడ్డి శ్యామల, తెలుగు అకాడమీ మలేసియా ప్రిన్సిపాల్ వెలగా అప్పలనాయుడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కేవీ గోషామహల్ రోడ్డు, బేగంబజార్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ అధికారులు ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ఏసీపీ కార్యాలయం, గ్రేవియార్డు, దుర్గా, గుబా కాంప్లెక్స్, ఫీల్‌ఖానా, అజీజ్‌పురా, దీపా నర్సింగ్‌హోం, లేబర్ అడ్డా, బేగంబజార్, సంతోష్ దాబా, వందేమాతరం స్కూల్, మచ్చిమార్కెట్ తదితర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరాఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సంగీతంతో మనసుకు ఆహ్లాదం



గన్‌ఫౌండ్రీ: సంగీతం మనసుకు ఆహ్లాదం అందించే గొప్ప శక్తి అని తెలంగాణ రాష్ట్ర భూగర్భ జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రకాష్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమీల ఆధ్వరలో రవీంద్రభారతిలో శనివారం నిర్వహించిన సుస్వర రాగోత్సవం ఆహుతులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంగీత కళలను పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు పరిచయం చేయాలని సూచించారు. సంగీత నాటక అకాడమీ చైర్మన్ దీపికారెడ్డి మాట్లాడుతూ.. శాస్త్రీయ సంగీత కళలను నేటితరానికి పరిచయం చేయడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ సిస్టర్స్ హరిప్రియ, కర్ణాటక శాస్త్రీయ సంగీత కళాకారులు శ్వేతా ప్రసాద్, రజనీల గాత్ర కచేరి ఆహుతులను సమ్మోహన పరిచింది. భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ

చార్మినార్: కందికల్‌గేట్ నల్లవాగు ధోబీఘట్‌లో ఈనెల 22న ఉదయం 11 గంటలకు రజక అభివృద్ధి సంస్థ తెలంగాణ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశ్యమోని శ్యామ్‌రావు ముదిరాజ్ ముఖ్యఅతిథిగా హాజరుతారన్నారు.

తల్లి, కుమారుడి అదృశ్యం



తహేరా బేగం, షేక్ అజాన్

గౌలిపురా: ఓ గృహిణి తన కుమారుడితో కలిసి కనిపించకుండా పోయిన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... తలాబ్‌కట్టా సిద్దిఖీనగర్‌కు చెందిన షేక్ మహమ్మద్, తహేరా బేగం (30) దంపతులు. వీరికి షేక్ అజాన్ (3) కుమారుడు. ఈనెల 20న మధ్యాహ్నం 2గంటలకు తహేరా బేగం తన కుమారుడు అజాన్‌తో కలిసి కుటుంబసభ్యులకు చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేసినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. తన భార్య, కుమారుడు కనిపించడం లేదని మహ్మద్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సమాజ సేవతోనే సంతృప్తి



సీతారామ్‌బాగ్‌లో స్క్రీనింగ్ క్యాంప్‌లో పాల్గొన్న డీసీపీ మధుకర్‌స్వామి

అబిడ్స్: సమాజ సేవ చేసినప్పుడే మనిషి ఎంతో సంతోషంగా ఉంటాడని డీసీపీ మధుకర్ స్వామి పేర్కొన్నారు. సీతారామ్‌బాగ్‌లో లయన్స్‌క్లబ్ గ్రీన్ ల్యాండ్స్, సేవాభారతి, మెర్సీమెషిన్, బీఎస్ఎంఎస్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో నిర్వహించే మెగా ప్లాస్టిక్ సర్జరీ స్క్రీనింగ్ క్యాంపు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మధుకర్ స్వామి మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలు నిరంతరం సమాజ సేవకు చేస్తున్న కృషి అమోఘమన్నారు. ప్రతిఒక్కరూ సమాజ శ్రేయస్సుకు, సమాజాభివృద్ధికి కొంత మేరకైనా సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు విద్యాభూషణ్, లయన్స్‌క్లబ్ గ్రీన్‌ల్యాండ్స్ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మీకుమారి, రఘునాథ్‌రెడ్డి, నిహారి మండలి పాల్గొన్నారు.

ప్రతిభ ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చు: మంత్రి తలసాని

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్రప్రభుత్వం చలనచిత్ర అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శనివారం కింగ్‌కోఠిలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థుల చేతే సినీ వ్యాల్యూషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. సంగీతం, దర్శకత్వం, నటన, రచన, లఘుచిత్రాల నిర్మాణంలో ప్రతిభను చాటుకునేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రతిభ ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చన్నారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సినీనటుడు కె.అనీష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.